సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 10 । సెప్టెంబర్ । 2023



ప్రశాంతంగా జరుపుకోవాలి

పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, రమణమూర్తి సూచించారు. 10లో



మార్పు ఇక్కడి నుంచే..

వచ్చే ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలని పార్టీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ఉమ్మడి జిల్లా ప్రజలను కోరారు. 12లో

గరిష్టం / కనిష్టం
29° / 24°

వాతావరణం

జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం కొంతమేర ఎండ ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాగా, చిత్రకూట మండపంలో నిర్వహిస్తున్న శ్రీమద్భాగవత సప్తాహ హవన ప్రవచనం కొనసాగుతోంది.

కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీలో ముగ్గురికి చోటు

సాక్షిప్రతినిధి, భద్రాద్రికొత్తగూడెం: డీసీసీబీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు మువ్వా విజయ్‌బాబుతో పాటు మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్యకు కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీలో స్థానం దక్కింది. మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చైర్మన్‌గా, 23 మంది వైస్ చైర్మన్లుగా మేనిఫెస్టో కమిటీని శనివారం ఏఐసీసీ ప్రకటించింది. ఇందులో ఈ ముగ్గురికీ అవకాశం లభించింది. వారికి పదవులు రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐసీసీ తమపై నమ్మకంతో కీలక బాధ్యత అప్పగించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

ఇద్దరు ఎఫ్‌డీఓల బదిలీ

పాల్వంచరూరల్ : జిల్లాలోని ఇద్దరు ఎఫ్‌డీఓలను ప్రభుత్వం బదిలీ చేసింది. పాల్వంచ డివిజన్ ఎఫ్‌డీఓ తిరుమల్‌రావును నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ఎఫ్‌డీఓగా, కొత్తగూడెం ఎఫ్‌డీఓ అప్పయ్యను హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథార్టీ విభాగానికి బదిలీ చేశారు. అయితే ఈ మేరకు అధికారికంగా ఉత్తర్వులు రావాల్సి ఉందని డీఎఫ్‌ఓ కృష్ణగౌడ్ తెలిపారు.

నేడు ఇల్లెందుకు ఈటల

ఇల్లెందు: నియోజకవర్గ పోలింగ్ బూత్ సమ్మేళనంలో భాగంగా మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఆదివారం ఇల్లెందుకు వస్తున్నారని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ బలగాని గోపీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కళాంజలి థియేటర్ నుంచి పాత బస్టాండ్ నుంచి ర్యాలీ, అనంతరం సభ ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నేతలు గరికపాటి మోహన్‌రావు, చాడ సురేష్‌రెడ్డి, కూన శ్రీశైలం గౌడ్ తదితరులు పాల్గొంటారని వివరించారు.

రేపు ఎంపీ వద్దిరాజు రాక

ఇల్లెందు: ఇల్లెందు నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమన్వయకర్త, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సోమవారం ఇల్లెందుకు రానున్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు భారీగా తరలి రావాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమన్వయ (ప్లానింగ్) కమిటీ చైర్మన్, జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగాల రాజేందర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. 2 వేల బైక్‌లు, 300 ఆటోలు, 200 కార్లతో ప్రదర్శన నిర్వహించాల్సి ఉందని, ప్రతి కార్యకర్త తన వాహనంతో తరలిరావాలని పిలుపునిచ్చారు.

సమస్యల నిలయాలు



శిథిలావస్థకు చేరిన కొత్తగూడెం బస్టాండ్



సాకర్యాల్లేని కొత్తగూడెం, భద్రాచలం బస్ స్టేషన్లు

- జిల్లా కేంద్రంలో శిథిలావస్థకు చేరిన బస్టాండ్
- తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడుతున్న అధికారులు
- భద్రాచలంలోనూ అరకొర వసతులే

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలోని ప్రధాన బస్ స్టేషన్లలో సమస్యలు తిష్టవేసి కూర్చున్నాయి. కొత్తగూడెం బస్ స్టేషన్ శిథిలావస్థకు చేరగా భద్రాచలం బస్టాండ్‌లో సాకర్యాలు కరువయ్యాయి. ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తే ప్రయాణికులకు సౌకర్యంతో పాటు ఆర్టీసీకి ఆదాయం వచ్చే మార్గాలు ఉన్నా ఆ దిశగా చేపడుతున్న చర్యలు శూన్యమన్నట్టుగా ఉన్నాయి.

వానొస్తే విలవిలే..

జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 1976లో కొత్తగూడెం బస్ స్టేషన్ ప్రారంభమైంది. 47 ఏళ్లు దాటడంతో భవనం పాతబడిపోయింది. ఎక్కడికక్కడ పెచ్చులూడి పడుతున్నాయి. వర్షం వస్తే కురవని చోటే లేదన్నట్టుగా తయారైంది. 47 ఏళ్ల కిందటి డిజైన్ కావడంతో ప్రస్తుత అవసరాలను ఈ స్టేషన్ తీర్చలేకపోతోంది. గడిచిన ఐదారేళ్లుగా తాత్కాలిక మరమ్మతులతోనే స్టేషన్‌ను నడిపిస్తున్నారు. విశాలమైన క్యాంటీన్, వెయిటింగ్ హాల్, అధునాతన రిజర్వేషన్ కౌంటర్లు లేవు. ప్రయాణికులు దిగే స్థలంలో షెడ్డు దారుణంగా ఉంది. వర్షంలో దిగితే తడవాల్సిందే. స్టేషన్‌లోకి బస్సులు వచ్చిపోయే మార్గాలు గుంతలమయం అయ్యాయి. కీలకమైన మణుగూరు, భద్రాచలం ప్లాట్‌ఫామ్‌ల దగ్గర డిజైనింగ్ లోపంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మంచినీరు, పారిశుద్ధ్యం వంటివి అథమ స్థాయిలో కొనసాగుతున్నాయి.

భద్రాద్రిలో క్లాక్‌రూమ్ కరువే..

భద్రాచలం బస్ స్టేషన్‌కు ప్రతీ రోజు వివిధ రాష్ట్రాలకు చెందిన 250 బస్సులు వచ్చిపోతుంటాయి. రోజుకు ఈ స్టేషన్ మీదుగా వెయ్యి మంది రాకపోకలు సాగిస్తారు. సెలవు రోజుల్లో ఈ సంఖ్య ఐదువేల వరకు కూడా ఉంటుంది. ఎక్కడెక్కడి నుంచో రామయ్య దర్శనానికి భక్తులు వస్తుంటారు. వీరి కోసం స్టేషన్‌లో కనీస సౌకర్యాలైన సామన్లు భద్రపరుచుకునే క్లాక్‌రూమ్, విశ్రాంతి తీసుకునేందుకు వెయిటింగ్ హాళ్లు (ఏసీ/నాన్ ఏసీ), స్నానం చేసేందుకు బాత్‌రూమ్‌లు, భోజనం చేసేందుకు క్యాంటీన్ వంటి కనీస సౌకర్యాలు ఈ స్టేషన్‌లో లేవు. ఈ సౌకర్యాలు కల్పిస్తే ఇటు ఆర్టీసీకి ఆదాయం రావడంతో పాటు దైవ దర్శనం కోసం వచ్చే భక్తులకు అనేక ఇబ్బందులు తొలగిపోతాయి. కానీ ఆ దిశగా ఎలాంటి చర్యలు లేవు. 1981లో నిర్మించిన ఈ బస్ స్టేషన్ అప్పటి అవసరాలకు తగ్గట్టుగానే ఉంది.

అంతర్రాష్ట్ర సర్వీసుల రద్దీ..

ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సమీపంలో భద్రాచలం పట్టణం ఉంది. ఈ రాష్ట్రాలకు చెందిన ప్రజలు విద్య, వైద్యం, ఉపాధి తదితర అవసరాల కోసం భద్రాచలం మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో అంతర్రాష్ట్ర బస్ సర్వీసులతో భద్రాచలం బస్టాండ్ కిటకిటలాడుతుంటుంది. హైదరాబాద్, వరంగల్, విజయవాడ వంటి పట్టణాల్లో ఉపాధి కోసం వెళ్లే వలస కూలీలు భద్రాచలం మీదుగానే ప్రయాణించాల్సి ఉంటుంది. దీంతో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని భద్రాచలం బస్టాండ్‌ను ఇంటర్ స్టేట్ బస్ స్టేషన్‌గా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు మరిన్ని బస్ సర్వీసులు నడపడం, ప్లాట్‌ఫామ్‌ల సంఖ్య పెంచడంతో పాటు బోర్డులను హిందీ, ఇంగ్లిష్, ఒడియా భాషల్లో కూడా ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. భద్రాచలం వచ్చే పర్యాటకులు, భక్తులతో పాటు ఈ పట్టణం మీదుగా రాకపోకలు సాగించే ఇతర రాష్ట్రాల ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా భద్రాచలంలోనూ నూతన బస్ స్టేషన్ నిర్మాణం దిశగా ఆర్టీసీ ప్రణాళిక రూపొందించాలని భద్రాచలంతో పాటు నాలుగు రాష్ట్రాల ప్రజలు కోరుకుంటున్నారు.

కొత్త భవనం ఎప్పుడో..?

తెలంగాణ ఆవిర్భావం తర్వాత సమస్యల వలయంలో చిక్కుకున్న ఖమ్మం బస్ స్టేషన్‌పై ప్రభుత్వం దృష్టి సారించింది. కొత్త బస్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకా రం చుట్టింది. రెండోసారి అధికారంలోకి వచ్చాక రవాణా శాఖ మంత్రిగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పువ్వాడ అజయ్‌కుమార్‌కు అవకాశం దక్కింది. ఆ వెంటనే ఖమ్మంలో ఆధునిక సౌకర్యాలతో బస్‌స్టేషన్ నిర్మించారు. ఇటీవల ఆర్టీసీ కన్వెన్షన్ హాల్ నిర్మాణ పనులు కూడా ప్రారంభించారు. తాజాగా శనివారం మణుగూరులో బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ తరహాలోనే కొత్తగూడెంలోనూ నూతన బస్ స్టేషన్ నిర్మించాలని జిల్లా వాసులు కోరుతున్నారు. ఇక రాష్ట్రంలోనే తొలి శాటిలైట్ బస్‌డిపో మంత్రి అజయ్ హయాంలోనే ఇల్లెందులో ప్రారంభమైంది. అలాగే కొత్తగూడెంలో కొత్త బస్ స్టేషన్ నిర్మాణానికి నిధుల సమస్య ఉంటే కనీసం ప్రభు త్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో అయినా నిర్మించే దిశగా ప్రయత్నాలు చేయాలని ప్రయాణికులు అంటున్నారు. లేదంటే డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్, సీఎం నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని వేడుకుంటున్నారు.

అర్హులంతా ఓటు నమోదు చేసుకోవాలి

కలెక్టర్ ప్రియాంక ఆల



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

మణుగూరు రూరల్ : ఈ నెల 19వ తేదీలోపు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, ఎస్పీ డాక్టర్ వినీత్‌తో కలిసి నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్, ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతీ పోలింగ్‌స్టేషన్‌లో తాగునీరు, విద్యుత్ సౌకర్యంతో పాటు దివ్యాంగుల కోసం ర్యాంప్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలించి నివేదికలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో భద్రాచలం ఆర్డీఓ మంగీలాల్, మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో ట్రెయినీ ఎఫ్‌బీఓల సందడి



కిన్నెరసాని ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న ఎఫ్‌బీఓలు

పాల్వంచరూరల్ : హైదరాబాద్ ధూల్‌పేట్ ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 35 మంది ఎఫ్‌బీఓలు శనివారం కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని సందర్శించారు. అభయారణ్యంలో వన్యప్రాణుల సంరక్షణ, వన సంరక్షణ, ప్లాంటేషన్ పెంపు తదితర అంశాలపై రేంజర్ శ్రీనివాసరావు ఎఫ్‌బీఓలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీఓ శిక్షణ బృందం కోర్స్ డైరెక్టర్ శివజ్యోతి, ఎఫ్‌ఎస్‌ఓ క్రాంతి, ఎఫ్‌బీఓలు కృష్ణ, సునిత తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో సీనియారిటీ జాబితా



కొత్తగూడెంఅర్బన్: ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి తాత్కాలిక ప్రొవిజినల్ సీనియార్టీ జాబితాను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఈఓ వెంకటేశ్వరాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లిస్టులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే 10, 11 తేదీల్లో ఆన్‌లైన్‌లోనే సంబంధిత పత్రాలు అప్‌లోడ్ చేసి తగిన ఆధారాలతో గ్రీవెన్స్ నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. తమ కార్యాలయంలో కూడా అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్ 1 నాటికి రెండేళ్ల సర్వీస్ లేనివారు, మ్యూచువల్‌లో జిల్లాకు వచ్చిన వారు అర్హత లేకపోయినా దరఖాస్తు చేసుకున్నట్లు అధికారుల దృష్టికి వచ్చినదని, అలాంటి వారు తమ దరఖాస్తులు తిరస్కరించాలని కోరుతూ ఆన్‌లైన్‌లోనే తెలపాల్సి ఉంటుందని వివరించారు. 2018లో జరిగిన బదిలీల్లో భార్యాభర్తల్లో ఏ ఒక్కరు స్పౌజ్ పాయింట్లు, ప్రిఫరెన్షియల్ కేటగిరీ వినియోగించుకున్నా వారికి ఇప్పుడు అవకాశం లేదని తెలిపారు. తప్పుడు సమాచారం ఇచ్చిన వారంతా ఆన్‌లైన్‌లో తమ పాయింట్లు ఉపసంహరించుకోవాలని లేదంటే చర్య తప్పదని డీఈఓ హెచ్చరించారు.

బూర్గంపాడులో కేజీబీవీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ, విప్ రేగా, కలెక్టర్ ప్రియాంక ఆల



ప్రజలకు అండగా ప్రభుత్వం

- రూ.13వేల కోట్లతో సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణం
- జిల్లా అభివృద్ధికి సీఎం ప్రత్యేక ప్రణాళిక
- నిధులు రాబట్టడంలో రేగాను మించిన వారులేరు
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

బూర్గంపాడు/మణుగూరురూరల్: రాష్ట్రంలో ప్రజలకు అండగా నిలిచేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. పినపాక నియోజవర్గంలోని బూర్గంపాడు, మణుగూరు మండలాల్లో ప్రభుత్వ విప్ రేగా కాంతారావుతో కలిసి శనివారం ఆయన పర్యటించారు. రూ. 37 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. బూర్గంపాడులో రూ 2.70 కోట్ల ఆర్‌ఎంఎస్‌ఏ నిధులతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ భవనాలను ప్రారంభించారు. బూర్గంపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రూ 2.70 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులతో నిర్మించనున్న భవన నిర్మాణపనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మణుగూరులోని హనుమాన్ టెంపుల్ వద్ద ఏర్పాటు చేసిన రథంగుట్ట అర్బన్ పార్క్‌ను ప్రారంభించారు. మణుగూరులో రూ.5 కోట్లతో నిర్మించనున్న నూతన బస్టాండ్, రూ.25 కోట్లతో నిర్మించే మున్సిపల్ కార్యాలయ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మణుగూరులో జరిగిన సమావేశంలో మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. కరోనా కష్టకాలంలో, గోదావరి వరదల సమయంలో ప్రభుత్వం ప్రజలకు చేదోడువాదోడుగా ఉందన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సైతం వ్యక్తిగతంగా సాయం చేశారని చెప్పారు. గోదావరి వరదల సమయంలో ఒక్క ప్రాణం పోకుండా కంటికి రెప్పలా కాపాడుకున్నామన్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేసే విపక్ష నాయకులు వరదలు, కరోనా సమయంలో ఎక్కడ నిద్రపోయారని విమర్శించారు.



మణుగూరులో మున్సిపల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి, విప్ తదితరులు

దూసుకెళుతున్న రేగా..

పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అభివృద్ధి పనుల్లో బుల్లెట్‌లా దూసుకెళుతున్నారని మంత్రి పువ్వాడ కితాబిచ్చారు. ప్రభుత్వం నుంచి నిధులు సాధించటంలో ఆరితేరాడని, అలాంటి ఎమ్మెల్యే ఉండడం పినపాక నియోజకవర్గ ప్రజల అదృష్టమన్నారు. జిల్లాలో 16 వేల మందికి పోడు పట్టాలిచ్చామని, జిల్లా రైతుల కోసం రూ.13వేల కోట్లతో సీతారామ ప్రాజెక్ట్ నిర్మిస్తున్నామని అన్నారు. ఈ ప్రాజెక్ట్‌తో రైతులకు సాగునీరు, తాగు నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లాను పారిశ్రామికంగా, వ్యవసాయపరంగా ముందు వరుసలో నిలిపేలా సీఎం కేసీఆర్ చర్యలు చేపడుతున్నారని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 10 అసెంబ్లీ సీట్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ డాక్టర్ వినీత్, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, జెడ్పీటీసీ సభ్యులు కామిరెడ్డి శ్రీలత, పోశం నర్సింహారావు, పీఏసీఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు అనూహ్య స్పందన

- జిల్లా వ్యాప్తంగా 10,528 కేసులు పరిష్కారం
- కొత్తగూడెం కోర్టులో అత్యధికంగా 6,527 కేసులు
- న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి వెల్లడి

కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 10,528 కేసులు పరిష్కారం అయ్యాయని తెలిపారు. జిల్లా కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, మోటార్ వాహన ప్రమాద కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకున్నారని తెలిపారు. కొత్తగూడెం జిల్లా కోర్టులో 6,527, ఇల్లెందులో 915, భద్రాచలంలో 1,947, మణుగూరులో 1,139 కేసులు పరిష్కారం అయ్యాయని వివరించారు. కాగా, కొత్తగూడెం కోర్టులో కక్షిదారులకు అరటిపండ్లు, పులిహోర, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్, ఉపాధ్యక్షులు డి.రమేష్, రావిలాల రామారావు, సంతోష్‌లాల్ సాహూ, పిట్టల రామారావు, మెండు రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.



న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి భానుమతి

కలహాలు లేని సమాజమే అభివృద్ధికి నిదర్శనం

క్షణికావేశంలో చేసిన తప్పులను పెద్ద మనసుతో క్షమించి రాజీమార్గంలో పయనించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా జడ్జి జి.భానుమతి అన్నారు. కొత్తగూడెం కోర్టులో శనివారం జరిగిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కలహాలు లేని సమాజమే నిజమైన అభివృద్ధికి నిదర్శనమని అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో సమస్యలు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదాతో పాటు స్వేచ్ఛాయుత జీవితాన్ని గడుపుతారని అన్నారు. కార్యక్రమంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఆడెపు నీరజ, మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎ.సుచరిత, పీపీ రాధాకృష్ణమూర్తి, ఏపీపీ పీవీడీ లక్ష్మి, విశ్వశాంతి, లావణ్య పాల్గొన్నారు.



కొత్తగూడెం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

డెంగీ..డేంజర్

- విషజ్వరాలతో పలువురు మృతి
- మూడు నెలల్లో 673 కేసులు
- తొమ్మిది రోజుల్లో 82 మందికి పాజిటివ్
- భయాందోళన చెందుతున్న ప్రజలు
- నేటికీ అందని దోమతెరలు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ఏజెన్సీ ఏరియాలో డెంగీ కోరలు చాస్తోంది. కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దోమకాటు, కలుషిత నీటితో డెంగీ, మలేరియా వంటి విష జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. ఇటీవలి వర్షాలకు పేరుకుపోయిన నీటి నిల్వల్లో లార్వా వృద్ధి చెంది దోమలు విజృంభించడంతో విషజ్వరాలు పెరుగుతున్నాయి. జిల్లాలోని ప్రభు త్వ, ప్రైవేట్ ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు బాధితులతో కిటకిటలాడుతున్నాయి. నీటి నిల్వల్లో లార్వా పెరగడంతో పాటు ఏజెన్సీ ఏరియాల్లో ప్రజలు శుద్ధినీటిని వినియోగించకపోవడంతో వ్యాధుల బారిన పడుతున్నారని వైద్యాధికారులు చెబుతున్నారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా జ్వరాలతో మృత్యువాత పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. కొత్తగూడెం పట్టణంలోని రామవరానికి చెందిన తొమ్మిదేళ్ల బాలిక జ్వరంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. జ్వరం వచ్చినా ఎలాంటి చికిత్స చేయించుకోకుండా పరిస్థితి విషమించిన తర్వాత ఆస్పత్రులకు వెళుతూ కొందరు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల కాలం కావడంతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని, కలుషిత నీరు తాగవద్దని, దోమలు దరిచేరకుండా చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

డెంగీ, మలేరియా కేసులు ఇలా..

జిల్లాలోని చర్ల, దుమ్ముగూడెం, గుండాల, భద్రాచలంతో పాటు జిల్లా కేంద్రం కొత్తగూడెం వంటి ప్రాంతాల్లో డెంగీ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. కొత్తగూడెం సర్వజన ఆస్పత్రిలోని టీ హబ్‌లో గత మూడు నెలల్లో 6,111 మందికి డెంగీ పరీక్షలు చేయగా, 673 కేసులు పాజిటివ్ వచ్చింది. ఈనెలలో శనివారం నాటికి 700 మందికి పరీక్షలు నిర్వహించగా 82 మందికి డెంగీగా నిర్ధారణ అయింది. గత మూడు నెలల్లో 128 పాజిటివ్ కేసులు కూడా నమోదు కావడం గమనార్హం. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని, జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆస్పత్రులకు వెళ్లాలని వైద్యాధికారులు చెబుతున్నారు. తెలిసీ తెలియని వైద్యుల వద్దకు వెళ్లి హైడోస్ మందులు వాడితే వ్యాధి నిరోధకశక్తి కోల్పోతారని, రక్తంలో ప్లేట్‌లెట్స్ పడిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. సాధ్యమైనంత వరకు పౌష్టికాహారం తీసుకోవాలని చెబుతున్నారు. అయితే వర్షాకాలం చివరి దశకు వచ్చినప్పటికీ ఏజెన్సీ ఏరియాల్లో ఇంతవరకూ దోమతెరలు పంపిణీ చేయలేదు. దీంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

మృతుల వివరాలిలా..

- గుండాల మండలం లింగగూడెం గ్రామానికి చెందిన రైతు కల్తి సోమయ్య(48) వారం రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతూ గత మంగళవారం మృతి చెందాడు.
- కరకగూడెం మండలానికి చెందిన ఇంటర్ విద్యార్థిని డెంగీ జ్వరంతో ఇటీవల మృతి చెందింది.
- అశ్వాపురం మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన వివాహిత(23), బుడుగుబజార్ గ్రామానికి చెందిన సిద్ద శివ(30) డెంగీ జ్వరంతో ఇటీవల మృతిచెందారు.

అప్రమత్తంగా ఉండాలి



సీజనల్ జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుతం డెంగీ, విషజ్వరాల సీజన్ అయినందున ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలి. నీరు, ఆహార నియమాలు పాటిస్తూ, దోమకాటుకు దూరంగా ఉండేలా చర్యలు చేపట్టాలి. విషజ్వరాలు ప్రబలిన ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య చికిత్స అందిస్తున్నాం.

– శిరీష, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి

క్లుప్తంగా

ట్రాఫిక్ సిగ్నళ్ల పునరుద్ధరణ



పోస్టాఫీస్ సెంటర్‌లో పనిచేస్తున్న ట్రాఫిక్ సిగ్నళ్లు

సాక్షి ఎఫెక్ట్..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో ట్రాఫిక్ సిగ్నళ్లను పోలీసు అధికారులు శనివారం పునరుద్ధరించారు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సిగ్నళ్లు పనిచేయడంలేదని, పోలీసులు జరిమానా విధిస్తున్నారని ఈ నెల 8న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పోలీస్‌శాఖ స్పందించింది. సిగ్నళ్లను పునరుద్ధరించడంతో ప్రధాన కూడళ్లలో రోడ్డు ప్రమాదాలు తప్పే అవకాశం ఉంది.

గోదావరి బ్రిడ్జిపై స్తంభించిన ట్రాఫిక్



బ్రిడ్జిపై నిలిచిన వాహనాలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం వద్ద గోదావరి బ్రిడ్జిపై శనివారం దాదాపు 20 నిమిషాలపాటు ట్రాఫిక్ స్తంభించింది. దీంతో అత్యవసర పనుల నిమిత్తం భద్రాచలం నుంచి సారపాక, సారపాక నుంచి భద్రాచలం వెళ్తున్న వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. స్పందించిన పోలీసులు ట్రాఫిక్‌లో ఏర్పడిన సమస్యను పరిష్కరించారు.

నేడు 'ఆయిల్‌ఫెడ్' భవనం ప్రారంభం



ప్రారంభానికి సిద్ధమైన ఆయిల్‌ఫెడ్ విశ్రాంతి భవనం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారంవారిగూడెం సమీపంలోని నర్సరీ వద్ద ఆయిల్‌ఫెడ్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన విశ్రాంతి భవన నిర్మాణం పూర్తయింది. రూ.కోటి 40 లక్షలతో అతిథి గృహం, అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీ ఆవరణలో రైతుల కోసం రూ. 8.90లక్షలతో ఫార్మర్ షెడ్లను నిర్మించారు. ఈ నిర్మాణాలు పూర్తికాగా ఆదివారం ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రారంభిస్తారని డీఓ ఎ.బాలకృష్ణ తెలిపారు.

ఏపీ వెళ్లే ఆర్టీసీ బస్సులు నిలిపివేత

చుంచుపల్లి: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్టు నేపథ్యంలో శనివారం జిల్లా నుంచి ఆంధ్రా వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా నిలిపివేశారు. ఉదయం నుంచే భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు డిపోల నుంచి విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కాకినాడ, గుంటూరు, మచిలీపట్నం, నెల్లూరు, ఒంగోలు తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన సర్వీసులను అధికారులు బస్టాండ్లు, డిపోల్లో నిలిపివేశారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు కూడా బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఆంధ్ర నుంచి జిల్లాకు వచ్చిన ఏపీ బస్సులను సైతం అధికారులు మధ్యాహ్నం వరకు నిలిపివేశారు. మధ్యాహ్నం తర్వాత బస్సులు తిరిగి ప్రారంభమయ్యాయి. జిల్లా నుంచి దాదాపు 20 సర్వీసులు నిలిచిపోగా, జిల్లాలోని మూడు డిపోల పరిధిలో సుమారు రూ.3 లక్షల వరకు ఆదాయం కోల్పోవాల్సి వచ్చిందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

ఇంట్లోకి వచ్చిన కొండచిలువ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని తిరుమలకుంట గ్రామానికి చెందిన జుజ్జూరి ప్రసాద్ ఇంట్లోకి శుక్రవారం అర్ధరాత్రి దాదాపు 10 అడుగుల పొడవు ఉన్న కొండ చిలువ ప్రవేశించింది. బీరువా వెనుక నుంచి కొండచిలువ బుసలు కొట్టడంతో గుర్తించి భయందోళనకు గురయ్యారు. గ్రామస్తులందరూ కలిసి కొండచిలువను బయటకు తీసుకొచ్చి కర్రలతో కొట్టి హతమార్చారు.

జామాయిల్ చెట్లు నరికివేత

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల–గానుగపాడు గ్రామాల రహదారి పక్కన ఉన్న జామాయిల్ తోటలోని చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికి అపహరించిన శనివారం చోటు చేసుకుంది. చండ్రుగొండ మండలం తుంగారానికి చెందిన రైతు భూక్యా చందర్ 10 ఎకరాల్లో జామాయిల్ తోట సాగు చేశాడు. ఆ తోటలో 60 జామాయిల్ చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికి ఎత్తుకెళ్లారు. సుమారు రూ.25 వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు.

ఆత్మహత్యలతో కుటుంబాలు ఛిన్నాభిన్నం

- క్షణికావేశంతో భవిష్యత్ బుగ్గిపాలు
- మనోధైర్యంతో ముందడుగేస్తే సమస్యలకు చెక్

నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం



సుజాతనగర్: సమస్య వచ్చినప్పుడు కుంగిపోకూడదని, మనోధైర్యం ముందడుగు వస్తే అందమైన జీవితం కనిపిస్తుందని పలువురు మానసిక వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. జీవితంలో కష్టాలు, నష్టాలు, అనారోగ్యం వంటివి చుట్టపుచూపులాంటివే. సమస్య వచ్చినప్పుడు ఎదురొడ్డి పోరాడితే విజయం తప్పక సొంతమవుతుంది. వీటిని పరిగణనలోకి తీసుకోకుండా పలువురు చిన్న సమస్యలకే కుంగిపోయి ఆత్మహత్య చేసుకుంటూ తనువు చాలిస్తున్నారు. దీంతో వారి కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయి. ఆత్మహత్యకు ముందు ఒక్క క్షణం తమను తాము ప్రశ్నించుకుంటే ఎన్నో జీవితాలు నిలబడతాయి. పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని, ప్రేమ విఫలమైందని, ఇంట్లో గొడవలు, అనారోగ్య కారణాలు, ఆర్థిక ఇబ్బందులు తదితర కారణాలతో పలువురు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఆలోచిస్తే ప్రతీ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని, అయితే ఇందుకు మనోధైర్యం, కుటుంబ సభ్యుల అండ ఉండాలని నిపుణులు చెబుతున్నారు. కాగా ప్రపంచవ్యాప్తంగా ఏటా 8 లక్షల మంది బలవన్మరణాలకు పాల్పడుతుండగా, వీరిలో 1.35 లక్షల మంది (17 శాతం) మనదేశానికి చెందిన వారే కావడం గమనార్హం.

ఉమ్మడి కుటుంబాల విచ్ఛిన్నంతోనే..

గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. ఏమైనా సమస్యలు వస్తే పెద్దలు ధైర్యం నూరిపోసేవారు. అందరితో కలిసిమెలిసి ఉంటున్న తరుణంలో ఎవరికీ ఆత్మహత్య చేసుకోవాలనే అభిప్రాయమే వచ్చేది కాదు. కాలానుగుణంగా ఉమ్మడి కుటుంబాల వ్యవస్థ విచ్ఛిన్నం కావడం, సంకుచిత ఆలోచనలు, చిన్నచిన్న కారణాలతోనే మానసిక ఒత్తిడికి లోనై పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. రోజురోజుకూ ఆత్మహత్యలు పెరిగిపోతుండగా, ఇందులో 20 నుంచి 40 ఏళ్ల వయసు గల వారే ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

కుటుంబం గురించి ఆలోచించాలి

ఆత్మహత్య చేసుకోవాలనే వారు ఒక్క క్షణం వారి కుటుంబం గురించి ఆలోచించాలి. సమస్య నుంచి బయటపడే మార్గం కోసం అన్వేషించాలి. మనం పోయాక కుటుంబం పరిస్థితి ఏమవుతుందో ఒక్కసారి యోచించాలి. తాము చనిపోతే మిగిలిన వారంతా హాయిగా ఉంటారని అనుకోవడం భ్రమనేనని, క్షణికావేశంలో ప్రాణాలను పోగొట్టుకొని కుటుంబానికి క్షోభ మిగల్చడం కన్నా, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని నిలబడటమే ఉత్తమ మార్గమని నిపుణులు సూచిస్తున్నారు.

చిన్న కారణాలతోనే ఎక్కువ



చిన్న చిన్న కారణాలతోనే పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఇంట్లో పెద్దవారితో లేదా స్నేహితులతో మాట్లాడితే పరిష్కారం లభించవచ్చు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలతో కుటుంబ సభ్యులకు శోకాన్ని మిగులుస్తున్నారు. సమస్య వచ్చినప్పుడు ఎదురించి పోరాడాలి.

–ఎం.సోమేశ్వర్, సుజాతనగర్ ఎస్‌ఐ

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

కొత్తగూడెంటౌన్/ఇల్లెందు: పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కొత్తగూడెం, ఇల్లెందు డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, రమణమూర్తి సూచించారు. శనివారం కొత్తగూడెం, ఇల్లెందులలో నిర్వహించిన పీస్ మీటింగ్‌లలో వారు మాట్లాడారు. ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా పీస్ మీటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేడుకలకు మతపెద్దలు సహకరించాలని కోరారు. గణేష్ ఉత్సవ కమిటీలు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించి మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలీస్ శాఖ సూచించిన నిబంధనలు పాటించాలన్నారు. ఏదైనా సమస్య తలెత్తితే ఠాణాలో సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా మత పెద్దలు పలు సమస్యలను విన్నవించారు. కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్, మత పెద్దలు అన్వర్, షేక్ అబ్దుల్‌బాసిత్, రజాక్ మాట్లాడుతూ నిమజ్జనం రోజు మద్యం, బెల్ట్ షాపులు మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రంగా కిరణ్ మాట్లాడుతూ గంజాయి కట్టడికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం సీఐలు కరుణాకర్, రమేష్, పెద్దన్నకుమార్, మురళి, మత పెద్దలు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన సీఎం కేసీఆర్

కార్యకర్తల సమ్మేళనంలో బీజేపీ నాయకులు



మాట్లాడుతున్న గరికపాటి మోహన్‌రావు

దమ్మపేట: సీఎం కేసీఆర్ డబుల్ బెడ్‌రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, ఉచిత ఎరువులు తదితర హామీలు ఇచ్చి విస్మరించారని బీజేపీ నాయకులు విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ పోలింగ్ బూత్ స్థాయి కార్యకర్తల, నియోజకవర్గ సమ్మేళనంలో మాట్లాడారు. మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దక్షతను చూసి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీని గెలిపించాలని కోరారు. నాయకులు చాడా సురేష్‌రెడ్డి, కూన శ్రీశైలంగౌడ్, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు లోపాయికారి ఒప్పందాలు చేసుకున్నాయని విమర్శించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీజేపీకి తప్ప ఏ పార్టీకి ఓటు వేసినా గెలుపొందిన ఎమ్మెల్యేలు స్వప్రయోజనాల కోసం పార్టీ మారడం ఖాయమని పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు నియోజకవర్గాల్లో తప్ప అభివృద్ధి ఇంకెక్కడ లేదని విమర్శించారు. బీజేపీ నాయకులు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, భూక్యా సీతారాం నాయక్, ఈవీ.నరేష్, నంబూరి రామలింగేశ్వరరావు, భూక్యా ప్రసాద్, ఉడతనేని విశ్వేశ్వరరావు, దారా నాగేశ్వరారవు, గొట్టిపుల్ల దుర్గా శ్రీనివాస్, మడకం రమేష్, రవి, పసుమర్తి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

కారు, కలప స్వాధీనం



పాల్వంచలో అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న కారు, కలప



దుమ్ముగూడెంలో పట్టుకున్న టేకు దిమ్మెలు

పాల్వంచరూరల్: రాత్రి సమయంలో కారులో అక్రమంగా తరలిస్తున్న నారవేప కలపను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఉల్వనూరు నుంచి పాల్వంచవైపు కారులో అక్రమంగా నారవేప జాతికి చెందిన కలపను తరలిస్తుండగా అటవీశాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో శుక్రవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది పాండురంగాపురం వద్ద కారును ఆపి తనిఖీలు నిర్వహించారు. రూ.30 వేల విలువైన కలపను గుర్తించి కారుతో సహా స్వాధీనం చేసుకున్నారు. ఉల్వనూరు ప్రాంతానికి చెందిన నిందితులు వజ్జ కృష్ణ, సంపత్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు రేంజర్ అనిల్‌కుమార్ తెలిపారు.

భద్రాచలంలో..

భద్రాచలంటౌన్: దుమ్ముగూడెం మండలం లచ్చిగూడెం, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో అక్రమంగా నిల్వ చేసిన ఆరు టేకు దుంగలను అటవీశాఖ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ కలప విలువ సుమారు రూ. లక్ష ఉండగా, డిపోకు తరలించామని, భద్రాచలం రేంజ్ అధికారి రజిత తెలిపారు.

చిన్నారిపై కుక్క దాడి

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు గ్రామ పంచాయతీ భీమ్లాతండాలో శనివారం ఇంటి ముందు ఆడుకుంటున్న ఐదేళ్ల బాలుడు నితిన్‌పై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పెంపుడు కుక్క దాడి చేసి గాయపర్చింది. బాలుడు ఏడుస్తుండగా ఇరుగుపొరుగువారు వచ్చి కుక్కను తరిమికొట్టారు. తల్లిదండ్రులు అజ్మీర కుమార్, సంధ్య బాలుడికి కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ఇల్లెందు: భార్యాభర్తల మధ్య ఘర్షణ నేపథ్యంలో మండలంలోని వేపలగడ్డ తండాకు చెందిన లకావత్ మంగీలాల్(40) శుక్రవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఖమ్మానికి తరలించి వైద్యం అందిస్తుండగా శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసినట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

కుటుంబ కలహాలతో..

ఖమ్మం క్రైం: భార్యతో గొడవ పడి పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఖమ్మం త్రీ టౌన్ సీఐ సత్యనారాయణ కథనం ప్రకారం.. భద్రాద్రి జిల్లా మణుగూరుకు చెందిన పులి దుర్గాప్రసాద్(30) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తుండగా, ఆయనకు భార్య నాగమణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం ఆయన భార్య గర్భవతి కాగా, మద్యానికి బానిసైన ఆయన తరచూ వేధిస్తున్నాడు. దీంతో ఆమె పిల్లలను తీసుకుని ఖమ్మం రంగనాయకుల గుట్ట వద్ద నివసించే దుర్గాప్రసాద్ అక్క ఇంటికి వచ్చింది. ఈమేరకు ఆయన కూడా ఇటీవల వచ్చి మరోమారు భార్యతో గొడవ పడడంతో ఆమె బయటకు వెళ్లింది. దీంతో మద్యంలో ఎలుకల మందు కలుపుకుని తాగిన ఆయనను ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందడంతో బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

దమ్మపేట: బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొని ఒకరు గాయపడ్డ సంఘటన మండల పరిధిలోని గంగులగూడెం గ్రామ శివారులో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... శనివారం ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి మండలం కమ్మన్నగూడెం గ్రామానికి చెందిన సరియం కామరాజు(30) బైక్‌పై మరొకరితో కలిసి మల్కారం నుంచి దమ్మపేట వైపునకు వస్తున్నాడు. ఈ క్రమంలో గంగులగూడెం శివారులో బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో కామరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చిట్టితల్లి అంబులెన్స్ ద్వారా దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకు అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం సత్తుపల్లి తీసుకెళ్లారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

బూర్గంపాడు: మండల పరిధిలోని సారపాక గాంధీనగర్‌కు చెందిన ఓ మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్న యువకుడిపై బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. ఎస్సై రాజ్‌కుమార్ కథనం ప్రకారం... సారపాక గాంధీనగర్‌కు చెందిన ఓ బాలికను వంశీ అనే యువకుడు ప్రేమించాలని వేధిస్తున్నాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు, బంధువులు శుక్రవారం రాత్రి అతనికి దేహశుద్ధి చేసి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. నిందితుడు సెల్‌షాప్ నిర్వహిస్తూ ఓ డిజిటల్ పత్రికలో విలేకరిగా పనిచేస్తున్నట్లు తెలిసింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణానికి చెందిన చల్లా శివకృష్ణ తన మొబైల్ ఫోన్ పోయిందని గత జూలై 15న ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి, మొబైల్ స్వాధీనం చేసుకుని శనివారం బాధితుడికి అందించినట్లు ఎస్‌ఐ విజయలక్ష్మి తెలిపారు.

14 బైక్‌లు స్వాధీనం

దుమ్ముగూడెం : మండలంలోని కొత్తూరు గ్రామశివారు అటవీప్రాంతంలో నిర్వహిస్తున్న కోడి పందేలపై సీఐ దోమల రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం దాడి చేశారు. పందెంరాయుళ్లు పారిపోగా 14 ద్విచక్ర వాహనాలు, కారు, నాలుగు కోళ్లను పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

బైక్ చోరీ

ఇల్లెందు: పట్టణంలోని జేకే కాలనీ ఏరియాకు చెందిన టి.లక్ష్మయ్య శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో తన ఇంటి ముందు బైక్ పార్కింగ్ చేయగా, దుండగులు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

దమ్మపేటలో...

దమ్మపేట: ఈ నెల 1న యర్రన్నపేట గ్రామంలోని కూల్ డ్రింక్ షాపు ముందు పార్క్ చేయగా తన బైక్‌ను చోరీ చేశారని మండలంలోని జమేదారుబంజర గ్రామానికి చెందిన కారం పోతురాజు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

గోడ ధ్వంసంపై కేసు నమోదు

దమ్మపేట: ఇంటి ప్రహరిని ధ్వంసం చేసిన ఘటనలో శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని పట్వారిగూడెం గ్రామానికి చెందిన కొప్పుల వెంకటేశ్వరరావుకు, అదే గ్రామానికి చెందిన పాదిలి నర్సింహారావుకు గతంలో గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలో నర్సింహారావు ఈ నెల 2న వెంకటేశ్వరరావు ఇంటి ప్రహరి గోడను గునపంతో పాక్షికంగా ధ్వంసం చేశాడు. అసభ్య పదజాలంతో దూషించాడు. బాధితుడు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

కాల్వలో వృద్ధుడి గల్లంతు

ముదిగొండ: కట్టకూరు పంచాయతీ సీతారాంపురానికి చెందిన వట్టే చిన్న నాగయ్య సాగర్ కాల్వలో పడి గల్లంతయ్యాడు. శుక్రవారం ఆయన పొలం వద్దకు వెళ్తొస్తూ స్నానం చేసేందుకు సాగర్ కాల్వలో దిగాడు. అయితే, ప్రమాదవశాత్తు కాలు జారి గల్లంతై ఉంటాడని భావిస్తున్నారు. నాగయ్య కాల్వలో దిగుతుండగా చూసిన రైతులు ఇచ్చిన సమాచారంతో శనివారం గాలింపు చేపట్టినా ఆచూకీలేదు.

ఇలా వెళ్తే భద్రమేనా..?





బూర్గంపాడు-రెడ్డిపాలెం మార్గంలో ద్విచక్ర వాహనానికి హెల్మెట్ వేలాడదీసి దూసుకెళ్తున్న బైకర్లు



పాల్వంచ: ద్విచక్ర వాహనంపై ఆరుగురు చిన్నారులతో వెళ్తున్న వ్యక్తి

ప్రాణరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని నిత్యం పోలీసులు హెచ్చరిస్తుంటారు. తనిఖీలు నిర్వహిస్తూ అవగాహన కార్యక్రమాలు చేపడుతుంటారు. ద్విచక్ర వాహనంపై ఇద్దరే ప్రయాణించాలని, హెల్మెట్ ధరించాలని నిబంధనలు విధించారు. రూల్స్ అతిక్రమించినవారికి జరిమానా విధించడంతోపాటు కేసులు నమోదు చేస్తున్నారు. అయినా ద్విచక్ర వాహనదారుల్లో మార్పు రావడంలేదు. పైన కనిపిస్తున్న చిత్రాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. పోలీసులు తనిఖీ చేసినప్పుడే బైక్ నడుపుతున్నవారు హెల్మెట్ ధరిస్తున్నారు. లేకపోతే వెనుక కూర్చున్నవారికి ఇవ్వడమో, బండికి వేలాడదీయడమో చేస్తున్నారు. శనివారం బూర్గంపాడు మండలంలో ఇలాంటి దృశ్యాలే కనిపించాయి. పాల్వంచలో ద్విచక్రవాహనంపై ఆరుగురు పిల్లలతో ఓ వ్యక్తి ప్రయాణిస్తుండగా బ్లూకోల్ట్ సిబ్బంది పట్టుకున్నారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాము తెలిపారు.

–బూర్గంపాడు/పాల్వంచ



రూ. 6 లక్షల కోట్లు

- ఏలేరు నుంచి స్కిల్ స్కాం వరకు ప్రజాధనం దోపిడీ
- రాజకీయ అరంగేట్రం నుంచే 'మేత'కు మరిగిన నేత
- ఎన్టీఆర్‌కు వెన్నుపోటుతో దొడ్డిదారిన అధికారంలోకి
- ఏలేరు స్కాంతో దేశంలో సంచలనం సృష్టించిన బాబు
- 1995-2004 మధ్య ప్రజాధనం దోపిడీలో విశ్వరూపం
- కుంభకోణాల బాబును 2004లో ఇంటికి పంపిన జనం
- విభజన నేపథ్యంలో హామీలు ఎర వేసి మోసం
- అధికారంలోకి వచ్చాక నిజ స్వరూపాన్ని చాటిన వైనం
- 'స్కాం'ల కోసమే స్కీంలు ప్రవేశ పెట్టిన ఘనత

దోపిడీకి రాచబాట

- అధికారులను బెదిరించి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పు
- చంద్రబాబుతో పాటు నారాయణ, లోకేశ్‌లదీ కీలక 'భూ'మిక
- లింగమనేనితో క్విడ్ ప్రో కో
- రోడ్డు అలైన్‌మెంట్‌లో అవినీతి మెలికలు
- ప్రతిగా కరకట్ట నివాసం, లింగమనేని నుంచి భూములు
- రూ. 2 వేల కోట్ల భూ దోపిడీకి బాబు స్కెచ్

సూత్రధారి, లబ్ధిదారుడు అంతా అతడే

- బలమైన సాక్ష్యాధారాలతోనే చంద్రబాబును సీఐడీ అరెస్టు చేసింది: సజ్జల
- ఇందులో రాజకీయ దురుద్దేశాలు, కక్ష సాధింపులు లేవు
- దేశ చరిత్రలో అత్యంత దారుణమైన ఆర్థిక నేరం స్కిల్ స్కామ్
- 2017–18లోనే ఈ కుంభకోణాన్ని బహిర్గతం చేసిన జీఎస్టీ ఇంటెలిజెన్స్ విభాగం
- చంద్రబాబు ఆదేశాలతోనే నిధులిచ్చామని ఇద్దరు సీనియర్ ఐఏఎస్‌లు కోర్టులో చెప్పారు
- స్కిల్ డెవలప్‌మెంట్, డిజైన్ టెక్, గత ప్రభుత్వంతో తమకు సంబంధం లేదన్న సీమెన్స్
- నిన్నటి వరకూ బాబు గొంతెత్తి అరుస్తూ తిరుగుతున్నారు కదా?
- అరెస్టు చేయగానే హఠాత్తుగా బీపీనా?.. చౌకబారు రాజకీయాలొద్దు

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ ముసుగులో ప్రభుత్వ ఖజానా నుంచి డిజైన్ టెక్, ఇతర షెల్ కంపెనీల ద్వారా రూ.371 కోట్ల దోపిడీలో ప్రధాన సూత్రధారి, పాత్రధారి, లబ్ధిదారుడు మాజీ సీఎం చంద్రబాబేనని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. చంద్రబాబు ఆర్థిక నేరానికి పాల్పడ్డారని బలమైన సాక్ష్యాధారాలు ఉన్నందు వల్లే సీఐడీ సిట్ విభాగం శనివారం ఉదయం 6 గంటలకు ఆయన్ను అరెస్టు చేసిందని తెలిపారు. నేరానికి సంబంధించి ఒక వ్యక్తి పాత్రపై కచ్చితమైన ఆధారాలు ఉన్నప్పుడు దర్యాప్తు సంస్థలు విచారణలో భాగంగా వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించడం సాధారణమేనన్నారు. ఈ కేసులో అసలు విషయాన్ని మరుగున పరుస్తూ రాజకీయంగా కక్ష సాధింపులో భాగంగానే అరెస్టు చేశారంటూ చంద్రబాబుతోపాటు టీడీపీ నేతలు, దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్, ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పూర్తి నిగ్రహం, సంయమనం పాటిస్తూ ఎలాంటి దురుద్దేశాలు లేకుండా బలమైన సాక్ష్యాధారాలు లభించిన తరువాతే చంద్రబాబును సిట్ అరెస్టు చేసిందని స్పష్టం చేశారు. శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో సజ్జల మీడియాతో మాట్లాడారు.



దేశ చరిత్రలో తీవ్ర ఆర్థిక నేరమిదే..

2017–18లో స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో డిజైన్ టెక్‌కు చేసిన చెల్లింపులపై జీఎస్టీ ఇంటెలిజెన్స్ విభాగం దర్యాప్తు చేసింది. ఇందులో రూ.240 కోట్లు షెల్ కంపెనీల ద్వారా దారి మళ్లినట్లు తేల్చింది. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భారీ ఎత్తున అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని 2018లో విజిల్ బ్లోయర్ ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై ఏసీబీ విచారణను అప్పటి సీఎం చంద్రబాబు తొక్కి పట్టి నోట్ ఫైల్స్‌ను మాయం చేశారు. ఆధారాలను ధ్వంసం చేయడం ద్వారా తన అక్రమాలను అప్పట్లోనే ఆయన అంగీకరించారు. ఏసీబీ దర్యాప్తును చంద్రబాబు తొక్కిపెడితే.. 2021 డిసెంబర్ 9న సీఐడీ సిట్ విభాగం విచారణ ప్రారంభించింది. ఈ కుంభకోణంపై దర్యాప్తు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నలుగురిని అరెస్టు చేసి డిజైన్ టెక్‌కు చెందిన రూ.31 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. తాము వద్దని వారించినా డిజైన్ టెక్‌కు నిధులు విడుదల చేయాలని అప్పటి సీఎం చంద్రబాబు ఆదేశించడం వల్లే నిధులు విడుదల చేశామని సెక్షన్ 164 కింద న్యాయస్థానంలో సీనియర్ ఐఏఎస్ అధికారులు సాక్ష్యమిచ్చారు. తమ పేరుతో డిజైన్ టెక్, నాటి రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందంతో తమకు సంబంధమే లేదని.. 90 శాతం గ్రాంట్–ఇన్-ఎయిడ్‌గా ఇస్తామని తాము ఎక్కడా చెప్పలేదని సెక్షన్–164 కింద న్యాయస్థానంలో సీమెన్స్ ప్రతినిధులు సాక్ష్యమిచ్చారు. ప్రభుత్వ ఖజానా నుంచి రూ.371 కోట్లను డిజైన్ టెక్‌కు దోచిపెట్టి షెల్ కంపెనీల ద్వారా వాటిని చంద్రబాబు తిరిగి తన ఇంటికి తెచ్చుకున్నారు. దేశ చరిత్రలో అత్యంత దారుణమైన ఆర్థిక నేరమిది. ఈ కుంభకోణంపై దర్యాప్తు చేసిన సీఐడీ విభాగం కోర్టులో అఫిడవిట్లు దాఖలు చేసింది. చంద్రబాబు అక్రమాలకు పాల్పడ్డారనడానికి బలమైన సాక్ష్యాధారాలు లభించడంతోనే ఆయన్ను అరెస్టు చేసింది. ఇందులో ఎలాంటి కక్ష సాధింపులు లేవు.

చట్టం ముందు అందరూ సమానులే..

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో తనను అరెస్ట్ చేస్తారని చంద్రబాబుకు ముందే తెలుసు. తనపై నేరారోపణ బలంగా ఉందని తెలుసు. అందుకే వారం క్రితమే తనని అరెస్ట్ చేస్తారని ప్రకటించారు. ఒకవేళ అరెస్ట్ జరగకపోతే తాను నిజాయితీపరుడిని కాబట్టే అరెస్టు చేయలేదని చెప్పుకునే ప్రయత్నం చేశారు. చంద్రబాబును అర్ధరాత్రి అరెస్టు చేశారంటూ ఆరోపణలు చేయడం విడ్డూరం. బాగా తెల్లవారిన తర్వాతే ఆయన్ను అరెస్టు చేశారు. తమిళనాడులో కరుణానిధిని అరెస్టు చేసినట్లుగా అర్ధరాత్రి వెళ్లి లేపి అరెస్టు చేయలేదు. చట్టం ముందు యువకుడైనా, వృద్ధుడైనా ఒకటే. ఆర్థిక నేరానికి పాల్పడ్డ కేసులో నిందితుడిని అరెస్టు చేయడానికి ముందు నోటీసు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎఫ్ఐఆర్‌లోనే అన్నీ ఉంటే ఇక విచారణ ఎందుకు? సీఐడీ దర్యాప్తులో తీగ లాగితే డొంకంతా కదిలి చంద్రబాబు వద్దకు చేరింది. అందుకే ప్రధాన నిందితుడిగా చేర్చి అరెస్టు చేశారు. కక్ష సాధింపులు చంద్రబాబుకే అలవాటు. వాటిని సీఎం జగన్‌కు ఆపాదిస్తే ఎలా? తన తండ్రి చంద్రబాబును పరామర్శించేందుకు లోకేష్ వెళ్తే ఎందుకు రానివ్వరు? అక్కడకు వెళ్లి రచ్చ చేయాలని చూస్తేనే సమస్య.

హఠాత్తుగా అనారోగ్యమా?

చంద్రబాబును న్యాయస్థానంలో సీఐడీ అధికారులు ప్రవేశపెడతారు. అవసరమైతే కస్టడీకి అడుగుతారు. అరెస్టు చేయగానే తనకు బీపీ ఉందని చంద్రబాబు అంటున్నారు. అనారోగ్యం సడన్‌గా వస్తుందా? నిన్నటి వరకూ గొంతెత్తి అరుస్తూ తిరుగుతున్నారే? ఉదయం లేవగానే హైపర్ టెన్షన్ ఎలా వస్తుంది? చౌకబారు రాజకీయ ఎత్తుగడలతో ఉపయోగం ఉండదు. టీడీపీ తన ఉనికిని ఎప్పుడో కోల్పోయింది. చంద్రబాబు సహా ఆ పార్టీ నేతలు ప్రజల సమస్యలను మర్చిపోయారు. వారు ప్రభుత్వంలో ఉన్నప్పుడు కూడా ప్రజల గురించి ఆలోచించలేదు. ఇప్పుడు కూడా అంతే. ప్రజలను భ్రమల్లో పెట్టి అధికారంలోకి రావాలనుకున్నారు. గతంలో అలానే అధికారంలోకి వచ్చారు. సీఎం జగన్‌ను, వైఎస్సార్ సీపీని దూషిస్తూ టీడీపీ బూతుల పార్టీగా మారింది. ఆ పార్టీకి ఓ స్పష్టమైన అజెండా అంటూ లేదు. సీఎం జగన్ చేస్తున్న మంచి పనులతో ప్రజల్లో మంచి స్పందన వస్తోంది. ఇది ప్రతి ఎన్నికల్లోనూ నిరూపితమవుతూనే ఉంది. వచ్చే ఎన్నికల్లోనూ అదే జరుగుతుంది.

తప్పుచేయని వారిని ప్రభుత్వం అరెస్టుచేస్తోంది

మీడియాకు వీడియో సందేశంలో పవన్‌కళ్యాణ్

- చంద్రబాబుకు జనసేన సంపూర్ణ మద్దతు
- రోడ్డు మార్గంలో విజయవాడ వచ్చేందుకు యత్నం
- జగ్గయ్యపేట వద్ద పోలీసుల అడ్డగింత
- రోడ్డుపైనే పడుకున్న జనసేన అధినేత..
- చివరికి పోలీసుల అదుపులో పవన్, నాదెండ్ల.. వాహనంలో అక్కడ నుంచి తరలింపు



రోడ్డుపై పడుకున్న పవన్‌కల్యాణ్

సాక్షి, అమరావతి/గన్నవరం/గరికపాడు (జగ్గయ్యపేట): తప్పుచేయని నేతలను ఈ ప్రభుత్వం అరెస్టు చేస్తోందంటూ జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అరెస్టుపై ఆయన స్పందిస్తూ.. చంద్రబాబుకు జనసేన సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందని తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియాకు ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. 'ప్రాథమిక ఆధారాలు చూపించకుండా అర్ధరాత్రి అరెస్టు విధానాన్ని రాష్ట్రంలో అవలంబిస్తున్నారు. గతేడాది అక్టోబరులో విశాఖపట్నంలో కూడ జనసేనపట్ల పోలీసు వ్యవస్థ, ఈ ప్రభుత్వం ఏ విధంగా వ్యవహరించిందో అందరూ చూశారు. ఏ తప్పు చేయని మా పార్టీ నాయకులపై హత్యాయత్నం కేసులు పెట్టి అరెస్టుచేశారు. ఇప్పుడు చంద్రబాబు విషయంలో నంద్యాలలో జరిగిన సంఘటన కూడా అలాంటిదే. ఆయన అరెస్టును జనసేన ఖండిస్తోంది. ఒక నాయకుడు అరెస్టయితే, ఆయనకు మద్దతుగా పార్టీ అనుచరులు, వాళ్ల పార్టీ క్యాడర్ కచ్చితంగా బయటకొస్తారు. అది ప్రజాస్వామ్యంలో భాగం. వాళ్లు ఇళ్లలోంచి బయటకు రాకూడదనుకుంటే ఎలా? దీనిని కచ్చితంగా రాజకీయ కక్షసాధింపు చర్యగా చూస్తున్నాం' అంటూ పవన్ వ్యాఖ్యానించారు.

పవన్ ప్రత్యేక విమానం ల్యాండింగ్‌కు అనుమతి నిరాకరణ..

ఇక పవన్‌కళ్యాణ్ ప్రత్యేక విమానం ల్యాండింగ్‌కు గన్నవరం ఎయిర్‌పోర్ట్ అధికారులు అనుమతి నిరాకరించారు. తొలుత కృష్ణాజిల్లా ఎస్పీ పి.జాషువా ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్‌కు శాంతిభద్రతల సమస్యను వివరిస్తూ విమానం ల్యాండింగ్‌కు అనుమతులు ఇవ్వవద్దని లేఖలో కోరారు. దీంతో ఎయిర్‌పోర్ట్ అధికారులు అనుమతివ్వలేదు. మరో వైపు.. చంద్రబాబు అరెస్టుకు సంఘీభావం తెలపడానికి పవన్ కళ్యాణ్ విజయవాడ రావడానికి ప్రయత్నిస్తే హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్ట్ లోనే పోలీసులు అడ్డుకున్నారని గన్నవరంలో జనసేన నేత నాదెండ్ల ఆరోపించారు.

రోడ్డుపై పడుకుని పవన్ నిరసన

అరెస్టయిన చంద్రబాబుకు సంఘీభావం తెలిపేందుకు పవన్ శనివారం రాత్రి విజయవాడ చేరుకునేందుకు రోడ్డు మార్గాన బయల్దేరారు. దీంతో ఆ పార్టీ నేతలు నాదెండ్ల మనోహర్ సహా కొందరు కార్యకర్తలు జగ్గయ్యపేట మండలం గరికపాడు వద్దకు చేరుకున్నారు. అయితే, పవన్‌ను గరికపాడు చెక్‌పోస్టు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అక్కడ నుంచి విజయవాడకు బయల్దేరినప్పటికీ, ఆ తర్వాత మరోసారి అనుమంచిపల్లి వద్ద పోలీసులు నిలువరించారు. ఆంక్షల నేపథ్యంలో అనుమతిలేదని పోలీసులు ఎంత నచ్చచెప్పినప్పటికీ పవన్ వినకపోవటంతోపాటు ఆయన మొండిగా రోడ్డుపై పడుకున్నారు. దాదాపు రెండు గంటలపాటు ఇలా హైడ్రామా నడిచింది. చివరికి ఆయనతోపాటు నాదెండ్ల మనోహర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనంలో తరలించారు. వీరిని ఎక్కడికి తరలిస్తున్నదీ పోలీసులు వెల్లడించలేదు. మరో వైపు.. పవన్, ఆ పార్టీ శ్రేణుల తీరుతో జాతీయ రహదారికి ఇరువైపుల ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కాగా, పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్‌ను చిల్లకల్లు మీదుగా విజయవాడకు పోలీసులు తరలించారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

'ఫైబర్‌గ్రిడ్'లోనూ అదే స్కిల్

- టెరాసాఫ్ట్ పేరుతో రూ.284 కోట్లు కొట్టేసిన లోకేశ్ సన్నిహితులు
- నెట్సాప్ పేరుతో డొల్ల కంపెనీ సృష్టించి కొట్టేసిన వేమూరి హరికృష్ణ
- ఫైబర్‌గ్రిడ్ కుంభకోణంపై సీఐడీ దర్యాప్తు
- ఇప్పటికే ఈ కేసులో నలుగురు సూత్రధారుల అరెస్టు
- త్వరలో కీలక సూత్రధారుని అరెస్టుకు రంగం సిద్ధం

కదిలిన అవినీతి పునాది!

- తాత్కాలిక భవనాలు, పేదల టిడ్కో ఇళ్ల నిర్మాణాల్లో చంద్రబాబు లూటీ
- ఈ కుంభకోణాలను సాక్ష్యాధారాలతో వెల్లడించిన ఆదాయపన్ను శాఖ
- షాపూర్జీ పల్లోంజీ, ఎల్అండ్‌టీ నుంచి రూ.118.98 కోట్లు కొట్టేసిన బాబు
- డొల్ల కంపెనీల ద్వారా ముడుపుల తరలింపు
- పార్టీ ఫండ్ రూపంలో కాకుండా నేరుగా నగదు కావాలని డిమాండ్

టిడ్కో ఇళ్లకూ రూ.8,929 కోట్ల 'టెండర్'

- ఐదు లక్షల మంది పేదలను దోచుకునేందుకు స్కెచ్
- 2,08,160 టిడ్కో యూనిట్ల కాంట్రాక్టును ఎనిమిది సంస్థలకు కట్టబెట్టిన వైనం
- చ.అ. నిర్మాణ వ్యయం రూ.వెయ్యిలోపే ఉంటే.. రూ.2,203 చెల్లింపు
- అధికంగా ముడుపులు ఇచ్చిన సంస్థకు ఎక్కువగా చెల్లించిన బాబు
- నిర్మాణ సంస్థను బట్టి రూ.2,534.75 నుంచి రూ.2,034.59 చెల్లింపు

జిల్లా వార్తలు

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు రశీదును అందజేస్తున్న ఆలయ ఇన్‌స్పెక్టర్

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి భక్తులు శనివారం రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన చెరుకూరి శేఖర్ – మాధవి దంపతులు ఆలయ అధికారులకు విరాళం అందచేయగా వారు స్వామి దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ సాయిబాబ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా వైద్యసేవలు అందించాలి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్యసేవలు అందించాలని సింగరేణి డైరెక్టర్ ఎన్.బలరామ్ సూచించారు. ఆస్పత్రి వైద్యులతో శనివారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే వారితో మర్యాదగా ప్రవర్తిస్తూ మెరుగైన వైద్యసేవలు అందించాలని స్పష్టం చేశారు. ఆస్పత్రి ఆధునికీకరణపై సీఎండీ సుముఖంగా ఉన్న నేపథ్యాన స్పెషలిస్ట్ వైద్యులను నియమించడంతోపాటు నూతన పరికరాలను సమకూర్చామని తెలిపారు. ఇటీవల కీళ్లమార్పిడి ఆపరేషన్లు కూడా ప్రారంభించడంతో ఆస్పత్రికి నమ్మకం పెరుగుతోందని చెప్పారు. ఈ సమావేశంలో సీఎంఓ సుజాత, డీవైసీఎంఓ విక్టర్ వందనం, ఏసీఎంఓ సునీలతోపాటు పీఓ మండల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీఏలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

ఖమ్మం సహకార్ నగర్: ఖమ్మంలోని కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎంబీఏలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ చేకూరి రవికుమార్ సూచించారు. ఐసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు వెబ్ ఆప్షన్‌లో తమ కళాశాల కేయూ కేహెచ్ ఎస్ఎఫ్‌ను మొదటి ప్రాధాన్యతగా ఎంచుకుని సీటు పొందాలని తెలిపారు. ఈనెల 11వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు గడువు ఉన్నందున వివరాల కోసం కళాశాలలో కానీ 99122 63863, 94406 52571 నంబర్లలో కానీ సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

మరింత విస్తృతంగా 'ఆరోగ్య మహిళ'

- ఉమ్మడి జిల్లాలో మరో 15 కేంద్రాలకు అనుమతి
- ఈనెల 12నుంచి మహిళలకు వైద్యపరీక్షలు



మహిళా ఆరోగ్య కేంద్రంగా ఎంపికైన నేలకొండపల్లి పీహెచ్‌సీ

నేలకొండపల్లి: మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న రాష్ట్రప్రభుత్వం పలు పీహెచ్‌సీల్లో మహిళలకు వైద్యపరీక్షలకు ఏర్పాటుచేసింది. ఆయా కేంద్రాల్లో ప్రతీ మంగళవారం పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తుండగా, ఆధునిక వైద్యం అవసరమైన వారికి జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలోని ఆరు కేంద్రాల్లో ఆరోగ్య మహిళ అమలవుతుండగా, కొత్తగా ఆరు పీహెచ్‌సీలకు అనుమతి ఇచ్చారు. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ తొమ్మిది కేంద్రాలకు అనుమతి జారీ చేశారు. ఆయా కేంద్రాల్లో ప్రతీ మంగళవారం ఉదయం 9నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మహిళలకు సంబంధించిన ఎనిమిది రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకోసం వైద్యాధికారులకు శిక్షణ కూడా ఇచ్చారు. ఇక్కడకు వచ్చే మహిళల నుంచి రక్త నమూనాలు సేకరించి జనరల్ ఆస్పత్రుల్లోని టీ హబ్‌కు పంపిస్తారు. అనంతరం నివేదికలను మహిళల ఫోన్లపాటు సంబంధిత మహిళా ఆరోగ్య కేంద్రాల వైద్యులకు పంపిస్తారు. ఈ నివేదికల ఆధారంగా వైద్యులు స్థానికంగా చికిత్స అందించి, తీవ్రత ఉంటే జనరల్ ఆస్పత్రికి రిఫర్ చేస్తారు. అక్కడ కేన్సర్ లక్షణాలు బయటపడితే మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు రిఫర్ చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఎంపికైన కేంద్రాలు ఇవే...

ఖమ్మం జిల్లాలో కొత్తగా పెనుబల్లి మండలం లంకాసాగర్, ముదిగొండ, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు, వేంసూరు, ఖమ్మంలోని పాత మున్సిపాలిటీ ఆరోగ్య కేంద్రాలకు ఆరోగ్య మహిళ పరీక్షలకు అనుమతి ఇచ్చారు. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం, జూలూరుపాడు, పినపాక, ఇల్లెందు మండలం రొంపేడు, కరకవాగు, పినపాక మండలం జానంపేట, పాల్వంచ మండలం ఉల్వనూరుతోపాటు ఇల్లెందు, పాల్వంచల్లోని బస్తీ దవాఖానాలకు అనుమతి మంజూరు చేశారు. ఆయా కేంద్రాల్లో వచ్చే మంగళవారం నుంచి మహిళలకు ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించనున్నారు.

ప్రత్యేక చికిత్స, వైద్యం



మహిళలకు మరింత మెరుగైన వైద్యసేవలందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా పలు సెంటర్లకు ఆరోగ్య మహిళ ద్వారా పరీక్షలు చేసేందుకు అనుమతులు జారీ చేసింది. ఇక్కడ మహిళా వైద్యులు, సిబ్బంది వైద్యపరీక్షలు, చికిత్స బాధ్యతలు నిర్వర్తిస్తారు.

– శ్రావణ్‌కుమార్, వైద్యాధికారి, నేలకొండపల్లి

మార్పు ఇక్కడి నుంచే మొదలుకావాలి..

- ఈసారి బీజేపీకి అవకాశం ఇవ్వండి
- మాటల్లోనే తప్ప చేతల్లో కానరాని 'బంగారు తెలంగాణ'
- బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్



సభలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్, పక్కన సుధాకర్‌రెడ్డి తదితరులు

వైరా: అన్ని పార్టీలకు ఇప్పటివరకు అవకాశం ఇచ్చిన ఖమ్మం జిల్లా ప్రజలు వచ్చే ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలని బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కోరారు. వైరాలో శనివారం జరిగిన నియోజకవర్గ స్థాయి బూత్ స్థాయి సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఖమ్మం జిల్లాలో బీజేపీ లేదని అంటున్న వారికి సమాధానం చెప్పేలా... మార్పునకు ఇక్కడి నుంచే నాంది పలకాలని పిలుపునిచ్చారు. వైరా ఎమ్మెల్యే రాములునాయక్ పదవి పోకముందే తన పనులకు ఆటంకం కలిగిస్తున్నారని చెప్పడం బీఆర్ఎస్‌లో పరిస్థితిని తెలియచేస్తోందని చెప్పారు. సాగు చేసుకుంటుటున్న భూముల జోలికి రావొద్దని కోరిన ఖమ్మం జిల్లా గిరిజనులు, మహిళలు, గర్భవతులను జైలుకు పంపిన ఘనత ఈ పాలకులదని ఆరోపించారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోతే రైతులను ఆదుకునేందుకు కేంద్రప్రభుత్వం ఫసల్ బీమా పథకాన్ని తీసుకొస్తే రాష్ట్రం వాటా చెల్లించకుండా నీరుగార్చిందని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే సన్న, చిన్నకారు రైతులతోపాటు కౌలు రైతులకు సైతం ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. అలాగే, బస్తాకు 600 గ్రాముల కంటే ఎక్కువ తరుగు తీయకుండా ధాన్యం కొంటామని, ఒకే ఇంట్లో భార్యాభర్తలు వృద్ధులైతే ఇద్దరికీ పింఛన్ ఇస్తామని చెప్పారు. కాగా, రైతు రుణమాఫీ చేస్తానన్న హామీని ఇన్నాళ్లు విస్మరించి, ఇప్పుడు ఎన్నికలు వస్తుండడంతో భూములు అమ్మి, వైన్స్ టెండర్లు నిర్వహించి రుణమాఫీ చేస్తున్నారని ఎద్దేవాచేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీలు గరికపాటి మోహనరావు, చాడ సురేష్‌రెడ్డి, రవీంద్రనాయక్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డితో పాటు కూసంపూడి వీరేందర్, శ్యాంసుందర్‌నాయక్, బీ.పీ.నాయక్, కృష్ణ రాథోడ్, అశ్వత్థామరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నంబూరి రామలింగేశ్వరరావు, శీలం పాపారావు, కొవ్వూరి నాగేశ్వరరావు, నెల్లూరి కోటేశ్వరరావు, కృష్ణరాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీని నియమించి.. ఐఆర్ ప్రకటించాలి



మాట్లాడుతున్న దుర్గాభవాని

ఖమ్మంసహకారనగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో చేసిన ప్రకటన మేరకు ఉద్యోగుల వేతన సవరణ కోసం కమిషన్‌ను నియమించడమే కాక, నివేదిక వచ్చే వరకు ఇంటీరియం రిలీఫ్(ఐఆర్) ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావా దుర్గాభవాని డిమాండ్ చేశారు. ఖమ్మంలోని యూటీఎఫ్ భవన్‌లో శనివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. అసెంబ్లీలో ప్రకటన చేసి రోజులు గడుస్తున్నా ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయలేదని, వేతన సవరణ సంఘాన్ని నియమించలేదని ఆరోపించారు. ఇకనైనా పీఆర్‌సీని నియమించడమే కాక ఉద్యోగులకు బకాయి ఉన్న మూడు విడతల డీఏ విడుదల చేయాలని, ఈ-కుబేర్‌లో పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ ట్రైబల్ వెల్ఫేర్ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్ల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని, కేజీబీవీ, యూఆర్ఎస్ సిబ్బందికి కనీస వేతనం అమలుచేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు బుర్రా వెంకన్న, పల్లంకొండ రాంబాబు, షేక్ రంజాన్, ఎ.సుధాకర్, మండవ నర్సయ్య, బానోతు రాందాస్, కె.గీత, రమేష్, పి.సురేష్, నిర్మలాకుమారి, నాగేశ్వరరావు, నాగూర్ వలీ పాల్గొన్నారు.

జీ-20 సదస్సుపై సెమినార్



పోటీల్లో విజేతలతో ట్రైయినీ ఐపీఎస్ అవినాశ్

ఖమ్మం స్పోర్ట్స్: ఢిల్లీలో జరుగుతున్న జీ- 20 సదస్సును పురస్కరించుకుని ఖమ్మంలోని కవిత మెమోరియల్ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఎన్‌సీసీ తెలంగాణ 11వ బెటాలియన్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ సెమినార్‌లో ట్రెయినీ ఐపీఎస్ అవినాశ్‌కుమార్ మాట్లాడుతూ జీ–20 సదస్సు నిర్వహణతో భారత్ ఖ్యాతి ప్రపంచవ్యాప్తంగా మార్మోగుతోందని తెలిపారు. బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ నవీన్ యాదవ్ మాట్లాడుతూ ఎన్‌సీసీ కేడెట్లకు దేశాభివృద్ధి, ప్రపంచ దేశాల సరసన మన పాత్రపై అవగాహన కల్పించేందుకు ఈ సెమినార్ నిర్వహించామని తెలిపారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ కోటా అప్పిరెడ్డి మాట్లాడుతూ కేడెట్లకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వీ.రమణ తదితరులు పాల్గొన్నారు.

పూడ్చిపెట్టిన మృతదేహానికి పోస్టుమార్టం

అనుమానాస్పద మృతిగా ఫిర్యాదుతో కేసు నమోదు

కామేపల్లి(కారేపల్లి): ఇటీవల పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి చెందగా... ఫుడ్‌పాయిజన్‌గా భావించి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఖననం చేశారు. అయితే, వివాహేతర సంబంధం నేపథ్యాన ఈ ఘటన జరిగినట్లుగా కుటుంబీకులు ఆలస్యంగా ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం చేయించారు. కామేపల్లి మండల కేంద్రంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకోగా, వివరాలిలా ఉన్నాయి. కామేపల్లికి చెందిన మోసం రాఘువ(29) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూనే సొంత కారును అద్దెకు తిప్పుతుంటాడు. గతనెల ఆగస్టు 31న అదే గ్రామానికి చెందిన మహిళను ఆమె బంధువుల ఇంటి వద్ద దిగబెట్టేందుకు కారులో వరంగల్‌లో వెళ్లి తిరిగి వచ్చే క్రమాన తొర్రూరులోని ఓ దాబాలో పురుగుల మందు తాగాడు. కారులోనే పడిపోయిన ఆయనను స్థానికులు గుర్తించి పోలీసులకు చెప్పగా వారు కుటుంబీకులకు తెలిపారు. దీంతో రాఘవను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి తీసుకొచ్చి చికిత్స చేయిస్తుండగా, ఈనెల 2న మృతి చెందాడు. అయితే, ఫుడ్ పాయిజన్ అయి ఉండొచ్చని వైద్యులు చెప్పడంతో సాధారణ మరణంగానే భావించిన కుటుంబీకులు రాఘవ మృతదేహానికి అదేరోజు అంత్యక్రియలు నిర్వహించారు. ఆతర్వాత ఆయన ఫోన్‌ను పరిశీలించగా ఓ మహిళతో పలుమార్లు మాట్లాడినట్లు గుర్తించగా, ఆమెతో వివాహేతర సంబంధం ఉనట్లు యటపడింది. దీంతో రాఘవ మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆయన సోదరుడు ఈనెల7న కామేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సదరు మహిళ కారణంగానే తన సోదరుడు మృతి చెందాడని, మానసికంగా, శారీరకంగా వేధించారని పేర్కొన్నాడు. అలాగే, ఘటన తొర్రూరు పరిధిలో జరిగినందున అక్కడ కూడా ఫిర్యాదు చేయగా అమరబోయిన రజిత అనే మహిళపై కేసు నమోదైంది. దీంతో శనివారం తొర్రూర్ ఎస్ఐ వేణు, కామేపల్లి తహసీల్దార్ లక్ష్మి సమక్షాన పూడ్చిపెట్టిన రాఘవ మృతదేహాన్ని బయటకు తీయించగా వైద్యులు అక్కడే పోస్టుమార్టం పూర్తిచేశారు.